



టప్...

అక్షరాలు దిద్దుకుంటున్న ఓ పిల్లాడి పలక మీద చినుకుపడి రూపాయి బిళ్ళంత మేర చెదిరి అక్షరం చెరిగిపోయింది.

"ఒరే సినుకులొత్తన్నాయిరా..." అన్నాడా పిల్లడు పక్క పిల్లాడితో ఆకాశం వైపు చూస్తూ.

"జొన్నా"... అంటూ పలక సంచిలో పెట్టేసేడా పిల్లడు.

ఆడుకుంటున్న పిల్లలు, అల్లరి చేస్తున్న పిల్లలు, బుద్ధిగా చదువుకుంటున్న పిల్లలూ అంతా తమ పుస్తకాలు, పలకలు సర్దేశారు మీదికి చూస్తూ.

పిల్లలకు తెలుసు "చినుకు పడితే బడికి శలవే" అని. పై కప్పులేని బీటలు వారిన గోడల మధ్య కూర్చున్న పిల్లలు మాస్టరు ఎప్పుడు వెళ్ళమంటారా అని ఎదురు చూస్తూ పరుగు పందానికి సిద్ధంగా వున్న క్రీడాకారుల్లా కూర్చున్నారు. ఆఫీసు రూము అనబడే నీళ్ళు చుమ్ముతున్న చెమ్మదేలిన గదిలోంచి మాస్టారు తొంగి చూసి కేకేసేరు.

"పిల్లలూ... వర్షం వస్తుంది. ఇళ్ళకు వెళ్ళండి..."

ఆ కేకనే బడి గంటగా భావించి పిల్లలు బిల బిలమంటూ పరుగులు తీసేరు వూళ్ళోకి.

మాస్టారు తలపైకెత్తి చూసేరు. పరుగులు తీస్తున్న పిల్లల్లాగే ఆకాశంలో మబ్బులు అల్లరిగా తిరుగుతున్నాయి. గాలి తెరలు అలలు అలలుగా మొహాన్ని తాకుతున్నాయి.

'ఇదేదో తుఫాన్‌లాగే వుంది. వారం రోజులు బడి మూసేయ వలసిందే కాబోలు... గెడ్డ రాక ముందే వూరు చేరుకోవాలి' అనుకుంటూ ఆఫీస్ గదిలోని రికార్డ్సు వుంచే చెక్క పెట్టెను 'మైకా గుడ్డ'తో తడవకుండా బాగా కప్పి... ప్రాథమికోన్నత పాఠశాల అన్న బోర్డును గదిలో దాచి, గదికి తాళం వేసి గొడుగు తీసుకుని బయలు దేరాడు.

కొద్ది క్షణాల్లో పరిసరాలు నిర్మానుష్యమై ప్రక్కనున్న పెంటకుప్పల్లో పెంట కుప్పగా దిగులుగా మొండి గోడలతో వానలో నానుతూన్న పాఠశాల 'నా గతి ఇంతేనా' అని రోదిస్తున్నట్లుంది. ఏడు తరగతులుగల ఆ బడి ముగ్గురే మాస్టర్లతో... ఒకే ఒక్క మాస్టారి హాజరుతో చినుకుపడితే సుమారు రెండు వందల మంది విద్యార్థినీ విద్యార్థులకు చోటివ్వలేక ఆ వూరి నిర్లక్ష్యానికీ, ఆ వూరి పెద్దల సంస్కారానికి... నిదర్శనంగా... ఆ వూరి యువకుల చైతన్యానికి ప్రతీకగా బీటలు వారిన మొండి గోడలతో కాటికి కాలు సాచిన దిక్కులేని బిచ్చగాడిలా వూరి చివర బిక్కు బిక్కుమంటోంది.

** **

"... చెప్పండి"

అందరూ ఆ యువకుని వేపు చూసేరు. అక్కడ సమావేశమైన గ్రామప్రజలందరినీ ఆ యువకుడు వేసిన ప్రశ్న ఆకర్షించింది. పెద్దలను నిలదీసిన విధం ఆకట్టుకుంది. దానికి కారణం ఆ ప్రశ్న... అందరి మనసుల్లోనూ వున్నదే...

తమ కనుసన్నలతో గ్రామ రాజకీయాలను నడుపుతున్న ఆ వూరి పెద్దలకు... ఆ ప్రశ్న ముల్లుగా గుచ్చుకుంది. కొడవలై మెడ మీద నిలిచినట్లైంది. మరీ ముఖ్యంగా పాత మునసబు రామినాయుడుకి.

ఊరి మధ్య రామమందిరం దగ్గర 'దేవుడు సాదరు' వేలం పాట కోసం సమావేశమైన ఆ గ్రామ సభలో సాదరు పాట అయిన తరువాత మరో వూళ్ళో టీచర్‌గా పనిచేస్తున్న ఆ గ్రామ యువకుడు 'చిన్నా' పాఠశాల దుస్థితిని వివరించి "...అది మనకు అవమానం కదా?" అనడిగేడు. "మన పిల్లలు కూర్చోడానికి చోటు లేక ఆ పెంట కుప్పలలో

తిప్పలు పడడం మనకు గౌరవమా?'' అన్నాడు... ''ఈవూరి బడి పిల్లలు అనాథలా! చెప్పండి'' అని ప్రశ్నించేడు. కాదు నిలదీసేడు.

రామ మందిరానికి చివర స్తంభాన్నానుకుని కూర్చున్న పాత మునసబు రామినాయుడు అన్నాడు.

''ఇతిప్పుడేటంటావు.. లేడికి లెగిసిందే వేళా...? దానికొక పద్ధతీ అదీ వుండొద్దా? అసలే వర్షాకాలం గడ్డిదొరుకుతాదా, కర్రలు దొరుకుతాయా? వర్షాలు తగ్గింతరువాత.. సంకర మావంకి సూసుకుందుంగానీ...'' ...

''ఔన్నెందర్రా... యిటువంటి పని వానాకాలం యేటౌతాది... నాయుడు సినబావు సెప్పినట్టు సంక్రమానికి సక్కగ సేసీవొచ్చును''... రామినాయుడికి వంత పాడేడు మరో పెద్ద తిరుపతినాయుడు.

''అదేటి? కుర్రోలు బడిపాక గురించి తొందరపడితే అంత తేలిగ్గ సంకురాతిరికీ... శివరాత్రికీ అంతా రేటో?'' పిల్లల తరుపున అడిగేడు పెద్దల్లోనే ఒకాయన సత్యం నాయుడు. మిగతా పెద్దలంతా మౌనంగా కూర్చున్నారు... కుర్రాళ్ళు మాత్రం ''మాకేదో ఒకటి చెప్పండి బడి పిల్లలకి కనీసం పాకైనా కట్టాల'' అంటూ పట్టుబట్టేరు.

చిక్కని చీకటి పంచాయతీ వారి ప్రతిభను చాటి చెబుతూ వూరిని కమ్ముకుంటుంటే రామ్మందిరం మీద మాత్రం యే వడ్డీ వ్యాపారంలోనో 'అద్దుమడి'గా వచ్చిన లాభాలు భక్తి పేరుతో బల్బుగా మారి వెలుగులు పంచుతోంది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ రామినాయుడన్నాడు. ''యేదో రేపు ఆలోచిద్దుంలెండి'' అని... రామ్మందిరం దిగివెళ్ళిపోయేడు. అతన్నే అనుసరించారు మిగతా పెద్దలు... విస్తుపోయారు కుర్రాళ్ళు. ఆ వూరి గ్రామ సభలు యే నిర్ణయమూ కాకుండా అలా ముగియడం సామాన్యమే అయినా, ఆ పెద్దలంతా ఒక్కో కుటుంబానికి ఒక్కో ప్రతినిధిలా వ్యవహరిస్తున్న వారే... వారి వారి వ్యక్తిగత కక్షలకు, పార్టీలకు ఆ వూరు ఏ అభివృద్ధికీ నోచుకోక అనాథ లా రోదిస్తోంది. దాన్ని పట్టించుకోని పెద్దలు మాత్రం ''సిగ్గులేని ముఖానికి నవ్వే సింగారం'' అన్నట్లు హాయిగా తిరిగేస్తున్నారు.

పెద్దలు అక్కడి నుండి వెళ్ళిపోవడంతో జనం పలుచబడిపోయేరు. పొర మేఘం కమ్మిన ఆకాశంలో అక్కడక్కడా తెల్లబోయి చూస్తున్న చుక్కల్లా... వున్నారు రామ్మందిరం మీద మిగిలిన కుర్రాళ్ళు. బడి విషయాన్ని అక్కడ లేవనెత్తిన చిన్నా అన్నాడు ''చూశారా... యిదీ మన పెద్దల పద్ధతి. మనం ఎంతో అవసరం అనుకున్నదాన్ని వాళ్ళు తేలిగ్గా తీసి పారేసారు... మనం మాత్రం యేదో ఒకటి చేయకపోతే లాభంలేదు''

''ఒరే చిన్నా... వాళ్ళు కాదంటే మనం యేం చెయ్యగలం రా'' అన్నాడో యువకుడు నిరుత్సాహంగా.

''అదిగో అదే వొద్దన్నాను. ఇన్నాళ్ళా మన వూరి సమస్యలు పరిష్కారం కాకపోడానికి ఈ పెద్దలే కారణం. పెద్దల్ని అడిగితే ప్రయోజనం లేదు. మనం తల్చుకుంటే మన బడి పిల్లలకు ఒక పాక కట్టడం కష్టమేమీ కాదు'' అన్నాడు చిన్నా.

''అవును కష్టం కాదు గానీ ఈ దసరా శలవులైపోతే నీ మల్ల నువ్వు బడికెళిపోతావు. మేం మా పనుల్లో పడిపోతాం. గుణుపూరు జంగాల మచ్చు ఐపోద్ది'' అన్నాడింకో కుర్రాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

''మనకి సేతగాక పోతే సరి సిన్న మేస్త్రి సెప్పినట్టుగ మన మనుకోవాలిగాని బడిసాల కట్టడం ని పాటి పని'' వుత్సాహంగా అన్నాడొక్కడు.

''మాస్టారూ... మీతో పాటు మేమూ వుంటాం... ఏం చెయ్యాలో ఏం చేద్దామో మీరే ప్లాన్ చెయ్యండి...'' ప్రిపరేషన్ హాలిడేస్‌లో వున్న డిగ్రీ స్టూడెంటన్నాడు. ''ఔను చిన్నాన్నా... ఔనోన్నయ్యా...'' అంటూ మరో నలుగురు కాలేజీ కుర్రాళ్ళు వుత్సాహంగా ముందుకొచ్చేరు. అక్కడ ఇంకా మిగిలివున్న యువకులు ''బడిసాల కట్టడానికి మా సాయం మేం చేస్తాం... యిదేటిది యింతూరుండి... బడిసాల కట్టుకోనే సేదమేటోస్... మీరు వూరుకుందురూ...'' అంటూ ప్రోత్సహించేరు. 'యిక లేద్దామా' అని అంతా లేవబోయేంతలో ఓ కుర్రాడన్నాడు.

''మన సర్పంచు రోజ్‌గార్ నిధుల్తోటి ఏటిసేస్పేడేటి వూరుకి... బడిసాలైనా కట్టొచ్చుగదా''

''ఔన్రా... అదీ నిజమే మా బాగ గేపకం సేసినావ్‌రా... రేపు అడుగుదుంగానీ ప్రెసిడెంట్‌ని...'' హుషారుగా అన్నాడొకడు.

''రోజ్‌గార్ నిధుల గురించి అడిగితే అది రాజకీయమై తగువులకు దారి తీస్తుందేమో'' అన్నాడు చిన్న సందేహంగా.

''ఎందుకు తగువౌతుంది? రోజ్‌గార్ నిధులు ప్రెసిడెంటు తిండానికా? వూరు బాగుసెయ్యడానికా?'' అన్నాడావేశంగా మొదటి కుర్రాడు.

''సరే రేపు ఉదయమే టీ తాగి అందరం కలుద్దాం... కలిసి ప్రెసిడెంటు దగ్గరకు వెళ్దాం'' అన్నాడు చిన్నా. అందరూ లేచేరు. వాళ్ళతో పాటూ కరెంటు కూడా...

ఆ వూరు పెద్ద మనుషుల అంతరంగాల్లాగా చీకటి మరింత నల్లగా... చిక్కగా... కమ్ముకుంది. ఓ కుర్రాడు టార్చిలైటు వేశాడు.ఆ వెలుగులో బల్బుల్లేని ఎలక్ట్రిక్ స్తంభాలు... స్వాతంత్ర్య దినోత్సవం నాడు కూడా మూడు రంగుల జెండా గుడ్డకు నోచుకోని జెండా కొయ్యల్లావుంటే రంగు కాగితాలకు నోచుకోని నలక తాళ్ళలా వేలాడుతున్నాయి ఆ స్తంభాల నుంచి విద్యుత్తీగలు.

కళ్ళను టార్చిలైట్లు చేసి చీకట్లు చీల్చుకుంటూ బురదలో జారి పడకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తూ ఇళ్ళ వేపు సాగిపోయేరు కుర్రాళ్ళు.

** ** **

ప్రెసిడెంటుగారి యింటి ఎత్తరుగుల మీద కూర్చున్నారు కుర్రాళ్ళంతా ప్రెసిడెంటు గడపలో

## చిట్టి చేతులు

మన హృదయాల మీద
అంతస్తులు లేచాయి
అక్కడ దృష్టి ముత్యం మీద
నిండా కరెన్సీ దుమ్ము...
చెవుల్ని వూదరగొట్టే
కీర్తిబూరలు ...
ఎక్కడో ఒక పువ్వుని,
దాని పరిమళాన్ని చెయి జార్చుకుంటాం
కనీసం స్మృతిని తట్టి లేపే గాలి...?
ఏ.సీ.లో దూరి
మన స్పర్శని తప్పు తోవ పట్టిస్తుంది.
ఇసుకలో పిచిక గూడు కట్టాక
బైటకు తీసిన కాలు
బూట్లలోకే మారి
ఒరిసి ... ఎలర్జీ పట్టింది.
కసుక్కున కాల్లో దిగిన
ముల్లే నయం -
చీల్చి వెండాడే చూపు కంటే.
అంతటి చలిలోనూ
స్వెట్టర్లను విసిరేసి
శీతలాన్ని వెచ్చగా కావలించుకునే వాళ్ళం.
ఎందుకీ యిరుకు గదులు?!
నాలిక నాలికను తడుముకున్న రాత్రి
తెల్లారేక కత్తులు దూస్తుంది.
ఎందుకీ ప్రయాస?!
ప్రవాహాల్లో ఈతలు మరచి
ఒడ్డమ్మట వెంపర్లాడుతూ
అర్ధనగ్న దృశ్యాలతో నాలిక తడుపుకోవటం ...
ఒళ్ళు అలవటం ఒక తీపి
అలుపును నిద్రల్లోకి విసిరేయటం ఒక తీపి
ఇప్పుడ్లా విసుగు ... నిస్పృహ
దరిదాపుల్లోనైనా కన్పించేవా?
మన చూపు మసకబారింది!
మన కంట్లో పువ్వులేశాయి!!
'రారా నాన్నా! నీ చిట్టి చేతులతో
నువ్వే శస్త్రచికిత్స చెయ్యాలి!'

— ఆప్తచైతన్య

కుర్చీలో కూర్చుని స్తంభానికి కాళ్ళు దన్ను పెట్టి... మట్టిపాగ గాల్లోకి వదిలి అన్నాడు–

"మీరు మంచి పని గురించే అడుగుతున్నారు నేను కాదన్నుగానీ మన పంచాయతీ సంగతి మీకు తెలీన్దా... మన పంచాయితీకి యేమి రాబడివుంది చెప్పండి! వీది బల్బులు వెయ్యడానికే యిబ్బంది గుంది. మీరంటున్నారు గాబట్టి రెండు మాసాలు పోనివ్వండి యేదో చేద్దుంగాని..."

అరుగుల మీద కూర్చున్న కుర్రాళ్ళకు ఏటవాలుగా పడుతున్న ఆ వుదయపు లేత యెండ కూడా చురుక్కుమనిపించినట్లయింది ప్రెసిడెంటు మాటలు విన్నాక.

"బడి పిల్లలు కూర్చోడానికి చోటు లేక నానా యిబ్బందులు పడుతున్నారు. అసలీ పని ఎప్పుడో చేయువలసింది. ఎవరూ పట్టించుకోలేదు. అందుకే వారం రోజుల్లో ముందొక షెడ్డయినా వేస్తే బిల్డింగ్ మాట తరువాత ఆలోచించవచ్చు. పంచాయితీలో సొమ్ము లేకపోతే మరో విధంగా... ఆ రోజ్‌గార్ నిధుల్లోంచయినా..."

చెప్పడం ఆపి... ప్రెసిడెంటు ముఖంలోకి చూసేడు చిన్నా. ప్రెసిడెంటు చిరాగ్గా ముఖం పెట్టి... అన్నాడు.

"ఏటి రోజ్‌గార్ నిధులా... యింకెక్కడి నిధులు వీధిలో కాలువలు తవ్వించా కదా... వాళ్లకీ వీళ్లకీ... తినిపించేసరికే సరిపోయింది... యింకేమ్మిగిలిందీ..."



అవి తిరుపతి వెంకట కవులకూ, కొప్పరపు **కవులకూ** మధ్య సాహిత్య సమరం జరుగుతున్న రోజులు. ఒక రోజు పల్నాటి సీమలోని వేమవరం గ్రామం**లో తిరుపతి కవుల** శతావధానం ఏర్పాటయింది. ఆహ్వానం పంపినా కొప్పరపు కవులు ఆ సభకు రాలేదు. సభికుడొకరు అవధానికి 'కొప్రమ్మున దాగియుంట ప్రతిపక్షులకున్ సహజమ్ముగాదొకో' అనే సమస్య నిచ్చారు. ఆ సమస్యను తిరుపతి కవుల అనుమతిపై 16 ఏళ్ళ పింగళి లక్ష్మీ కాంతంగారు ఇలా పూరించారు.

"రమ్మని పిల్వనంపిన యరాతుల యందలి భీతి వేసి ప్రా
ణమ్ములు దక్కవంచు నయనమ్ముల బాష్పములుప్పతిల్ల శో
కమ్మున కొప్రమందిరికి కానగరాదిది వింత కాదు కొ
ప్రమ్మున దాగియుంట ప్రతిపక్షులకున్ సహజమ్ము కాదొకో"

– గూడూరి నమశ్శివాయగారి 'పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర' నుంచి

"నిధులన్నీ కాలవల్లోనే పోస్సేరా... సర్లెండి రోజ్‌గార్ నిధులు ఎవరెలా తింటే మాకెందుగ్గానీ... మేమడిగింది ఒక పాక కట్టించమని." కాలేజీ కుర్రాడు కరుగ్గానే అనేశాడు. ఆ మాటతో ప్రెసిడెంటు సర్రున లేచేడు.

"ఎవరెలా తింటే... అంటే... ఒరే... నీ వుద్దేశమేటో నాకర్థమైందిరా... యిదంతా చూస్తే... మిమ్మల్నిక్కడికి ఎవులు పంపారో... యీ పని మీకు ఎవులు పురమాయించేరో... తెలిసిపోతందిరా... అందుకే నేటి ఆ వీధి నుంచి యీ వీధి కొచ్చావు... వచ్చి నన్ను లెక్కలడిగేస్తున్నావు... ఒరే నీ కంత అడగాలనుంటే ఆ దేవుడు సాదరు కమిటీ వుంది కదా ఆ కమిటీ ప్రెసిడెంటు ఎవులు...మీ చిన్నాన్న... మీ చిన్నాన్న నడుగురా దేవుడు సాదరు లెక్కలు చెప్పమనీ..."

విషయం దారి తప్పుతోందని గ్రహించి చిన్న అన్నాడు తాను కల్పించుకుంటూ......

"మమ్మల్నెవరూ పంపించలేదు. మా వెనక ఎవరి చెయ్యీ లేదు. మీరు గ్రామం బాగు కోరు కున్నవారైతే గ్రామానికి మంచి పనులు చేస్తారు. మంచి పేరు




తెచ్చుకుంటారు. అంతే.. మేము కోరింది బడి పిల్లలకో పాక. దానికి మీరు మరేదో అనుకుని కోపం తెచ్చుకుంటే చెప్పలేం గానీ... మీరు పంచాయితీ సొమ్ముతోనో... రోజ్‌గార్ నిధు ల్తోనో... మరి దేంతోనో ఒక 'పాక' కడితే సంతో షిస్తాం. కాదంటారా... మేం మరో దారి చూసు కుంటాం... అంతే గానీ... "తప్పు చూపెట్టి అప్పు ఎగ్గొట్టడం" అంటారే అలా చెయ్యకండి."

"అది కాదు చిన్న మేస్టు... నేనంటున్నదీ... రోజ్‌గార్ నిధులూ... రోజ్‌గార్ నిధులూ అని నా మీద పడేడుస్తారు గానీ... ఆ దేవుడు సాదరు సొమ్ము అలాగే మూలుగుతంది మూడేళ్ళ నుంచీ.. అందు లోంచి తియ్యొచ్చు కదా..అదీ నా పాయింటు. వెళ్ళండి దేవుడు సాదరు సొమ్ములోంచి ఓ వెయ్యి రూపాయిలు తీసివ్వమనండి కమిటీకి" అని లేచి ఇంట్లోకి వెళ్ళిపోయేడు ప్రెసిడెంటు.

పొద్దు మరి కొంచెంపై కెక్కింది. వాతావరణం కొద్దిగా వేడెక్కింది. అరుగుల మీది కుర్రాళ్ళు ప్రెసిడెంటు చర్యకు ఒక్క క్షణం రాగితో చేసిన విగ్రహాల్లా నిశ్చేష్టులై... అరుగులు దిగిపోయేరు.

"ప్రెసిడెంటిచ్చాడు యింత కట్ట... యింక కమిటీ వోశున్నారు యివ్వడానికి... ఛస్... ఎవుడ్నీ అడగొద్దు... పదండి మనమే ముష్టెత్తి చందాలు వసూళ్ళు చేసి బడిపాల కడుదుం గానీ..." విసురుగా లేచేడొకడు... కుర్రాళ్ళంతా లేచేరు. చిన్నా లేచేడు... లేచి.

"చివరికి మనం చేయవలసింది అదే అయినా బాధ్యులైన వారందర్నీ అడిగీ కాదనిపించుకున్నాకనే మనమూ పనిచేయడం మంచిది. ఒక మంచి పని చేయడానికి ఆవేశం, విసుగు పనికిరావు. రండి... దేవుడి సాదరు కమిటీ వాళ్ళనూ కలుద్దాం..." అని రామ్మందిరం వేపు దారి తీసేడు.

రామ మందిరం మీద స్తంభాల నానుకుని కమిటీ మెంబర్లు అయిదుగురూ కూర్చున్నారు. మధ్యలో కుర్రాళ్ళు కూర్చున్నారు.

కమిటీ మెంబర్లందర్నీ ఓసారి చూసి కమిటీ ప్రెసిడెంట న్నాడు. "మీరడిగింది బాగానే వుంది. అయినా మేము పెద్దల్నోసారి కనుక్కోవాలి గదా..."

"మాటాడితే సాదరు సొమ్ము దొరుకుతాది. ఏమీ రోజ్‌గార్ సొమ్ములోంచి ప్రెసిడెంటుని యిమ్మనవచ్చుగదా..." మరో కమిటీ మెంబరు ఒక మాట విసిరేడు.

"అదయ్యాకనే మీ దగ్గర కొచ్చేము. మీమాటే - మిటో చెప్పండి? అదీ వినేస్తే" కమిటీ ప్రెసిడెంటు కళ్ళలోకి చూసేడు చిన్నా. కమిటీ ప్రెసిడెంటు మిగతా మెంబర్ల వేపు చూసేడు... చూసి...

"నేను చెప్పాను గదా మా విషయం. గ్రామ పెద్దలు అంగీకరించినట్లైతే యివ్వడానికి మాకేమీ అభ్యంతరం లేదు..." అన్నాడు నేను చెప్ప వలసింది యింతే అన్నట్టు.

చిన్న తన వాళ్ల వేపు చూసేడు. కుర్రాళ్ళ ముఖాలు ఆవేశంతో ఎర్రబడ్డం గమనించేడు. అందర్నీ వుద్దేశించి యిలా అన్నాడు. "సరే పెద్ద లందరి అంగీకారం కోసం యిదిగో యీ తెల్ల కాగిత మ్మీద విషయం రాసి సంతకాలు పెట్టించి తెస్తాం పెద్దలందరి చేతా... అప్పుడు సొమ్ము యివ్వడానికి అభ్యంతరం లేదు కదా." అని కమిటీ మెంబర్ల వేపు చూసేడు. అభ్యంతరం లేదన్నట్టు తలలూపేరు కమిటీ మెంబర్లు.

"ఏం కమిటీ మెంబర్లయ్యా. మీరు యీవూళ్ళో మనుషులు కారూ... మీకు మాత్రం బాధ్యత లేదూ. ఆ మాత్రం స్వతంత్రించలేరూ... మీరా సొమ్ము చెడ్డ పని కోసం తియ్యాలనుకోవడం లేదు కదా. ఎవడడుగుతాడు మిమ్మల్ని. మీరేదో వుత్సాహ వంతులని కమిటీగా వేస్తే మీరూ ఆ పెద్దల్లో కలిసి పోయినట్టుగుంది. ఒరె యిళ్ళ వాలకం చూస్తే... యిచ్చినట్టు కనబడలేదు..." ఓ కుర్రాడు వ్యంగ్యం మిళితమైన ఆవేశంతో అనడంతో కమిటీ మెంబరొ కడు రెచ్చిపోయేడు.

"ఒరే... మీ రేటాటనుకోండి... మేము సాదరు సొమ్ము దేవుడు కోసమే ఖర్చు చేస్తాం. బడికి ఖర్చు చెయ్యవలసిన అవసరం మాకు లేదు. దానికీ దీనికీ ఖర్చు పెట్టేసి సాదరు సొమ్ము యిలగే పాడు జేస్సి నారు. ఎల్లండే ఎవులు సంతకాలు చేసినా డబ్బు యివ్వం"

"ఆ.. ఎందుకివ్వరు! ఆ సొమ్ము మీ ముసిలమ్మ మొగుడిదా... యివ్వరట యివ్వరు... సొంత సొమ్మైతే యిల్లెక్కి కేక లేసును గావాల." కంయ్ మన్నాడు కాలేజీ కుర్రాడు.

"ఆగండి... ఎందుకీ వాదనలు. మనం పెద్దల సంతకాలు చేయించుకొద్దాం. వాళ్ళేయిస్తారు సొమ్ము" అంటూ మందిరం దిగిపోయేడు చిన్నా.

* * *

సాయంత్రం ఇంకా పొద్దు మునగలేదు - గానీ మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో అప్పుడే చీకటి పడుతున్నట్టుగా... మస మసగ్గా పై నుండి బూడిద రాల్తున్నట్టుగా వుంది. వీధుల్ని బురద చేస్తూ పశువులు సాలలకు చేరుకుంటున్నాయి. కరెంటు లేదు. ఆ మసక చీకట్లోనే రామ్మందిరం మీద కూర్చున్నారు కుర్రాళ్ళు. సంభాషణ ప్రారంభిస్తూ చిన్నా అన్నాడు.

"మనం చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాం. పెద్దలు పట్టించుకోలేదు. ప్రెసిడెంటూ కాదన్నాడు. సాదరు కమిటీ వాళ్ళు పెద్దల మీద పెట్టి తప్పించు కున్నారు. ఎవరు ముందు సంతకం చేస్తే యేమై పోతామో అన్నట్టు ఎవరూ సంతకం చేయలేదు పెద్దలు. ఇదంతా చూస్తే యీ వూళ్ళో పెద్ద మనిషన్న వారెవరికీ బడి పట్ల ఆసక్తి లేదని తేలి పోయింది."

"ఇప్పుడు తేల్దమేటి. బడి పడిపోయి యేడా దయ్యింది. అసలు బడికి మేష్టర్లు వస్తున్నారో లేదో ఎవుడికీ అక్కర్లేదు. అది బాగా కనిపెట్టాడు హెడ్మా ష్టరు. వారం కొకసారి వస్తాడు. అడిగినోడెవుడు?" అన్నాడో యువకుడు.


"నిజమే! మనం యిక నుంచైనా స్కూలు విషయం పట్టించుకోకపోతే పిల్లలు అన్యాయమైపో తారు. మనం ముందు స్కూలుకు 'పాక' కట్టి టీచర్ని సంగతి ఆలోచిద్దాం. మన పని నీలి మందు కుంచెతో ప్రారంభిస్తున్నాం యిప్పుడే...!"

* * *

నాటక ప్రదర్శనలో మరో రంగానికి తెర వేస్తు న్నట్టు పలచబడిన 'చీకటి నీలి తెర' మెల్ల మెల్లగా తొలగిపోతోంది. కాకుల అరుపులతో పాటు పశువుల సాలల్లో తపేలాలలోకి జారుతున్న పాల ధారల సవ్వడికి దోమల సంగీతం జత కలిసి అద్భుతమైన ఓ కొత్త రాగంలా వినిపిస్తోంది.

కాఫీ దుకాణాల్లో... పొయ్యిలు మండేయి... ఆ పొయ్యిల చుట్టూ బెంచీల మీదా... అప్పటికే చేరి పోయేరు జనం. రామ్మందిరం ఎదురుగా వున్న టీ కొట్టు యింకా రద్దీగా వుంది. ఆ టీ కొట్టులోని జనం కళ్ళన్నీ తెల్లారే ఆ తెల్లని వెలుగులో రామ్మందిరం తెల్లటి గోడ మీద నిలిచేయి. ఆ గోడ మీద నీలి మందుతో రాసి వున్న పెద్ద పెద్ద అక్షరాల మీద పడిచేయి... అలాంటి అక్షరాలు చాలా గోడల మీద ప్రత్యక్షమయ్యేయి.

"ఈ వూళ్ళో పెద్దలు బతికి వున్నారా"?
ఈ వూరి బడి పిల్లలు అనాథలా..!
బిచ్చగాడి శవానికీ మన వూరి బడికీ తేడా ఏమిటి?
"మనది బడా? లేక తెలుగు మహిళా బహి



ర్యామా?..."

ఎన్నికలప్పుడు కూడా అక్షరాల స్పర్శ ఎరుగని ఆ వూరి గోడలు ఆ అక్షరాల బరువును ఆనందంగా కించిత్ గర్వంగా మోస్తున్నాయి. తొలి పూత పూసిన చెట్టును చూసినట్లు చూసేరు గోడల్ని అందరూను. పెద్ద మనుషులనబడే వారు మాత్రం మల్లె పొదలకు మందారాలు పూసినట్లు ఆశ్చర్యపోయేరు. ఆశ్చర్యం కోపమై క్షణాల్లో వారి కళ్ళ మందారాలే అయ్యేయి. చూసీ చూడనట్లు ముఖాలు తిప్పుకున్నా లోలోపల మాత్రం 'దుప్పుకు'లో పెట్టిన 'కర్ర పెండలం' దుంపల్లా వుడికిపోయేరు. ఊరు వూరంతా ఆదే చర్చనీయాంశమైంది. అందరూ... కుర్రాళ్ళు చేసిన పనిని సమర్థించేరు. "మంచి పనిచేశార్రా... మన పెద్దలకి సిగ్గొచ్చేటట్లు చేసారు" అన్నారు.

తొలి వెలుగురేకలు నేలను ముద్దాడక ముందే భుజాన సంచీ దోపుకుని రామ్మందిరం దగ్గరికి చేరుకున్నాడు చిన్నా. ఆ వెనకే ఒకరి తరువాత ఒకరుగా ఓ ముప్పయి మంది యువకులు వచ్చి చేరారు. వారికి తోడు బడిపిల్లలు. బడిపిల్లల చేతుల్లో కట్టె పుల్లలకు దోపిన అట్టముక్కలు. ఆ అట్టముక్కల మీద అక్షరాలు.

"మాకు బడి కావాలి"

"చదవడానికి మాకు చోటు చూపించండి"

యువకులూ బడిపిల్లలూ కలసి నినాదాలిస్తూ బయలుదేరేరు. ఇంటింటి ముందూ ఆగి విషయం చెప్పి చందాలు అడిగేరు.

"బడిపిల్లల కోసం ఓ పాక కట్టడానికి సహాయం చెయ్యండి ఎంత తోస్తే అంత ఇయ్యండి" అంటూ చెయ్యి సాచారు.

"అదేటి బావూ.. మీరేటి సెద్ద పనికి అడుగుతున్నారా.... యజమాన్లుకి నేకపోయినా మీరైనా దారుకున్నారు" అంటూ ఓ ఇల్లాలు పది రూపాయలిచ్చింది ఆనందంగా.

"మా నాయనే బడిసాల కట్టడానికి పూనుకున్నట్టిగే ఆ నీలాటి రేవులు బాగుసేయించి దరమ్ము కట్టుకోండి నాయనా. వరసం బడితే కుండడు నీలు తెచ్చుకోడానికి గొప్ప నిరబందన పడిపోతన్నాం. ఈ వూరికి పెద్దలున్నారా.... పెసిరెంటున్నాడా" ఒకావిడ ఐదు కాగితం సంచీలో వేసింది.

"అవునర్రా ఎందుకలాగ అరుసుకోని తిరుగుతన్నారు. దసరా ఎలిపొచ్చిందేటి.. ఒక గుంటడు సేతిలోనా బానం నేదూ" అంటూ ఓ ముసల్ది ముడతలు పడ్డ ముఖాన్ని వ[illegible]స్తూ.. కళ్ళు చికిలించి చూస్తూ.

చిన్నా అంతా వివరించేడు.

అంతా విని... "పెద్దలు పెద్దేళ్ల కలసిపోనుయిద... నా దగ్గర ముచ్చెవకున్నాది" అంటూ గైనాన దోపి వుంచిన జాలి లోంచి మూడు పావలాలు తీసి చిన్నా సంచిలో వేసింది.

ఊరంతా తిరిగేరు. చందా ఇచ్చిన అందరి పేర్లూ ఓ పుస్తకంలో వ్రాసేడు చిన్నా. పావలా ఇచ్చినా కూడా వ్రాసుకున్నాడు. ఇంచుమించుగా అందరూ ఇచ్చేరు అంతో ఇంతో. ఇవ్వనిదల్లా పాత మునసబూ... కొత్త ప్రెసిడెంటూ.

వూరు పూర్తయ్యేసరికి రాత్రి ఏడయ్యింది.

అంతా రామ్మందిరం దగ్గరికి చేరుకున్నారు. డబ్బులు లెక్కవేశారు. "ఏడు వందల తొంభై మూడు రూపాయిల ఇరవై అయిదు పైసలు... ఓహ్... మనం నిర్భయంగా పాక కట్టొచ్చు..." చిన్నా సంతృప్తిగా చూసేడు అందరి వేపూ.

"రేపు ఎదురుపొదులున్నా లందరికీ ఎదురు కర్రలు అడిగి పడితే" గుర్తుచేసేడొకడు.

మరుచటి రోజు మనిషో కత్తి, గొడ్డలి పట్టుకుని వెళ్లి వెదుళ్ళున్న వారందర్నీ అడిగి ఓ వంద వెదురు కర్రలు కొట్టుకొచ్చేరు. అక్కడక్కడా పెద్దలంటున్న మాటలు అపశ్రుతుల్లా వినిపిస్తూనే వున్నాయి. "ఆ ఇప్పుడు వూళ్ళో దండీశారు గానీ ఆ రాటి కర్రలూ, పంచ పట్టెలు కొండ కాసితే వొద్దూ... ఆ అంత పనకేటి..."

ఈ విమర్శలు కుర్రాళ్ళ నింకా రెచ్చగొట్టేయి. మరింత తొందరగా చెయ్యాలనే పట్టుదలను రేకెత్తించేయి. అంతే ఆ మరునాడు షెడ్‌కు కావలసిన రాటకర్రలు, నిట్టలు, పట్టీలు అన్నీ వచ్చి పడ్డాయి. 'బడిసాల' నిర్మాణానికి సరంజామా సిద్ధమైంది. ఇంక కావలసింది నేతకు గడ్డి. అదీ ఇప్పుడు సమస్య.

"అవును అదే సమస్య. ఏ గెడ్డ బాడవనో రెల్లి గడ్డికో యిద్దుమంటే యింక ముదర్నేదు. సెరుకు సోరూ దొరకదిప్పుడు. ఒకవేల దొరికినా ఏ సీతానగరమో, అప్పయ్యపేటో ఎలిపోవాల.... తెచ్చేసరికి


OSCAR

THE MARK OF EXCELLENCE



OSCAR CORE SENIOR

Also available with 8 programme UHF/VHF electronic tuning

- AC/DC Auto • Uniquely Styled, Monitor Shaped Cabinet • 51 cm High Clarity Anti-Glare Screen
- The AVR System for high quality Audio Video Regulation
- SMPS Power Supply 90 to 270 Volts
- High Gain Operation
- Low Power Consumption

North Star-G

MARKETED BY:

SPECTRUM ELECTRONICS

PHONE: 64015.

RAMAMANDIRAM ROAD
GOVERNER PET
VIJAYAWADA-2.

తడిసి మోపెడైపోద్ది.. ఎలాగా..."

"ఐతేటి నేత ఆగిపోద్దేటి కొంపదీసి"

"ఎందుకాగిపోద్దోస్ తంపర్ల బోల్డు 'దబ్బి' వున్నాది. ఆ ఎల్లయ్య దద్దనీ, శీరాములు బావునీ అడిగితే 'దబ్బిగడ్డి' కుప్పాలంక"

"ఔ(నా... మా బాగా గేపకం సేసినా వురా....."

తర్జనభర్జనయ్యాక చివరికి తంపర చెరువులో దబ్బిగడ్డి కోయించడానికి నిశ్చయమైంది.

"మరెందుకు...గడ్డి కోతకు చెప్పినట్టే పాక నిల బెట్టి నేతకు కూడా బేరమాడిస్తే 'సత్యం దద్దా' 'పకీరన్నయ్యా', 'గున్నయ్యన్నా' ఎలాగా వుంతారు. వాళ్ళకి బాగ తెలుసును. దగ్గరుండి బాగా చేయిస్తారు. నువ్వు రేపు బడి కెళ్లిపోతే ఈ జనాలు రేపు మరి రారు"

ఆ మాటన్న కాలేజి కుర్రాడి వేపు చూసేడు చిన్నా.

"నిజమే... పాక కట్టడం... గడ్డి నేయడం అయిం తర్వాత అందరం కలిసి తుప్పలు, డొంకలు తీసేసి చుట్టూ కంచె వేసేద్దాం"

"ఔను ఎలుగుపెట్టకపోతే రాత్రయ్యేసరికి ఆ కొసీది ఆడోలు అటే ఎల్తారు ముంతలు పట్టుకోని"

చివరికి గడ్డికోతకూ.... పాక కట్టడానికీ నేతకీ మొత్తంగా బేరమాడేసేరు. పని ప్రారంభించడం తోనే ఆరంభమయ్యింది ముసురు. అలా పట్టిన ముసురు వారం దినాలు వదలలేదు. పెద్దలకిది అవకాశంగా తోచింది.

"మేమన్నాం గామా... వుడుకు రత్తం గదా యున్లేదు. యిప్పుడు కట్టమనండి పాక. ఆ మేష్ట్రి బడి కెలిపోతాడు. ఈ గుంటలెవులూ పట్టించుకోరు. అసలే వానాకాలం యిప్పుడవ్వదు అని ముందే సెప్పినాం. యింతే గదా. ఒట్టినే అన్నారా... ఆడపెత్తనం బాలనాయరకం అని...."

ఈ మాటలు కుర్రాళ్ళకు ముళ్ళులా గుచ్చినా మౌనంగా వుండిపోయేరు.

దసరా దాటింది. ముసురూ తగ్గింది. 'కోత కోసి దుక్కిదున్నేసిన మడిచెక్కలా వుంది.... నిర్మలంగా మబ్బుల్లేని ఆకాశం ఎర్రని ఎండ పడి వీధులు బురద యింకి గట్టిపడ్డాయి. కుర్రాళ్ళా వీధుల్లో పడ్డారు. ఫెళ్ళున కాసే మబ్బులు వీడిన ఎండలాగే కుర్రాళ్ళా హుషారుగా వున్నారు. ఆ 'తెరిపి'లో రెండు రోజుల్లో 'బడిసాల' నిర్మాణం పూర్తయింది. కుర్రాళ్ళంతా పారలు పట్టి తుప్పలు కొట్టి గడ్డి చెక్కేసి పరిసరాలు శుభ్రం చేశారు. చుట్టూ కంచె పెట్టి రకరకాల మొక్కలు నాటేరు. అదో అందమైన ఆశ్రమంలా చేసేరు. అక్షరాభ్యాసానికి ముచ్చటగా ముస్తాబైన చిన్న పాపలా, ముద్దుగా చూడచక్కగా వుందా 'బడిసాల'.

ఆ పాక వేపు తృప్తిగా చూసుకున్నారు కుర్రాళ్ళు. పాకను చూసుకున్న కుర్రాళ్ళ కళ్ళు విరగబూసిన నందివర్ధనాలైతే ఒకరిద్దరి పెద్దమనుషుల కళ్ళు రాజుకున్న నిప్పురవ్వలే అయ్యేయి. యువ రక్తపు

> **మొత్తం ప్రజలని పురుగుల్లా పరిగణించే ప్రభుత్వం వున్నంత కాలం, ఓ మనిషి చావుకు కారణం ఆకలా అర్థాకలా అని ఎడతెగని నిరర్థక చర్చోప చర్చల్లో నిర్దాక్షిణ్యంగా కాలహరణం చేస్తూ దమన నీతితో రాజ్యమేలుతున్న ప్రభుత్వం సాగుతున్నంత కాలమూ ఈ దేశపు వ్యథ ఆరదు.**
>
> **—మేరీ టేలర్**
>
> **'భారతదేశంలో నా జైలు జీవితం'**

అప్రమత్తత ముందు ఆ నిప్పులు ప్రజ్వరిల్లే అవకాశం లేక చివరికి బొగ్గులే అయ్యాయి.

బడిసాల ప్రారంభం.

ఆ వూరందరికీ అదో పండుగలా వుంది.

యువ హృదయాలకో సంబరంలా వుంది. కట్టింది పెద్ద బిల్డింగ్ కాకపోవచ్చు. కనీసం సిమెంటు రేకుల షెడ్డయినా కాకపోవచ్చు. అది కేవలం పూరి పాకే కావొచ్చు కానీ... అందులో సంఘటితమైన శ్రమ వుంది. సమైక్యత ఇచ్చే సంతోషం వుంది. 'శ్రమైక జీవన సౌందర్యం' తొణికిసలాడే సందేశం వుంది.

పొద్దు బారెడు పైకి రాకముందే వూరంతా అక్కడికి చేరుకుంది. కాదన్న పెద్దలూ కొందరు అందులో వున్నారు. ముఖ్యులనుకున్న ఇద్దరు మాత్రం రామమందిరం దగ్గర 'వెళ్లాలా వద్దా' అన్నట్లు నిల్చుండి పోయారు. ఒక్కసారి పిలిస్తే వచ్చేస్తాం అన్నట్లున్నాయి వారి చూపులు. పళ్ళు రాలిపోయి గోళ్ళు విరిగిపోయి శక్తులుడిగి.... 'తమ ముందు గంతులేసే లేడిపిల్లలను ఏమీ చేయలేకపోయే' సింహాల్లా కనిపించేరా ఇద్దరూ కుర్రాళ్ళకి. చూసి నవ్వుకున్నారు.

బడిసాల దగ్గర సందడి.

రంగు కాగితాల తోరణాలు... జండాలు రెపరెపలాడేయి. గాలికెగిరే ఆ జండాల రెపరెపల్లా బడిపిల్లల తుళ్ళింతలు. అక్కడ వుత్సాహం వురకలేస్తోంది.

"కార్యక్రమం ప్రారంభిస్తున్నాం... గ్రామస్తులంతా రావల్సిందిగా కోరుతున్నాం" అంటూ మైక్‌లో చెప్పేడు. చిన్నా.

అంతటా నిశ్శబ్దం అలముకుంది. ఏదో తెలియని పవిత్రత, గాంభీర్యం చోటుచేసుకుందక్కడ.

ఓ అయిదేళ్ళ పిల్లాడు జ్యోతి వెలిగించాడు.

ఏడో తరగతి పాప సభాధ్యక్ష స్థానాన్ని అలంకరించి (చిన్నా ముందే వ్రాసి ఇచ్చిన మాటల్ని) తన శ్రావ్యమైన గొంతుతో ముద్దు ముద్దుగా వినిపించింది. బడిసాల నిర్మాణ చరిత్రను సంక్షిప్తంగా తెలియజేసింది. ఏలేఖరుల కెమేరాలూ మెరిశాయి ఒకటి రెండుసార్లు.

ఆ బడిసాల ప్రారంభోత్సవ కార్యక్రమం అపూర్వంగా నిర్వహించబడి అద్భుతంగా జరిగింది. ఆ వూరి చరిత్రలో అది ఒక మలుపై...పెద్దమనుషుల పెద్దరికానికి వెన్నుచరుపై... యువతరానికి మేలుకొలుపుగా నూత్న చైతన్య స్ఫూర్తితో ఒక యువజన సంఘ ఆవిర్భావానికి బీజం వేసింది.

* * *

టప్.... టప్..... టప్.....

"ఒరే సినుకులు పడుతున్నాయిరా..." పలక సంచీలో పెట్టబోతూ పక్కవాడి వేపు చూశాడో పిల్లాడు.

"చినుకులు పడితే అప్పుడు లాగ శలవివ్వరు. అక్షరాలు దిద్దు" ఆ మందలింపుతో ముంజూరు నుండి సిల్కు దారాల్లా జీరాడుతున్న వర్షపు ధారలకు చేయి అడ్డుపెట్టి ఆ నీళ్లతో పలక శుభ్రం చేసి అక్షరాలు వ్రాయడం ప్రారంభించాడా పిల్లాడు "అ...ఆ..." అంటూ రాగాలు తీస్తూ.

పిల్లలు దీర్ఘాలు తీస్తూ చదివే ఆ రాగాల రవళి కురుస్తున్న వాన నీటి సవ్వడితో కలసి చిత్రంగా పవిత్రమైన వేద పఠనంలా శ్రావ్యంగా చిరుచలిని పులుముకున్న గాలి అలల్లో తేలి మంద్ర మంద్రంగా దిగంతాలకు వ్యాపిస్తోంది. ★

